క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పరవాడ: దలాయిపాలెంలోని ఎమ్మెల్యే అదీప్ రాజ్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో జగనన్న సురక్ష కార్యక్రమం, గడపగడపకు మనప్రభుత్వం, అభివృద్ధి కార్యక్రమాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమీక్ష లు ఉంటాయని చెప్పారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలని రామారావు పిలుపునిచ్చారు.

52 మందికి వైద్య పరీక్షలు


రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యురాలు నవ్య

పరవాడ: వాడచీపురుపల్లిలో సింహగిరి ఆస్పత్రి వ్యవస్థాపకుడు దివంగత కేవీరామన్ జ్ఞాపకార్థం ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని డాక్టర్ నవ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో 15 రోజులకోసారి సింహగిరి ఆస్పత్రిలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించాలని యోచిస్తున్నామన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉన్న రోగులకు ఆరిలోవలోని హెచ్‌సీజీ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నామని డాక్టర్ నవ్య చెప్పారు. 52 మందికి వైద్య సేవలు అందించారు.

వ్యక్తి అదృశ్యం


నర్సింగరావు

సింహాచలం: వ్యక్తి అదృశ్యంపై పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ అసిరి తాత తెలిపిన వివరాలు.. పెందుర్తిలోని శారదా నగర్‌కు చెందిన భావన నారాయణ నర్సింగరావు(35) ఈనెల 3వతేదీ సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఈమేరకు అతని భార్య లక్ష్మి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈనెల 14న మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9440796039, 6281779940 నంబర్లకు సమాచారం ఇవ్వాలని అసిరి తాత తెలిపారు.

యువకుడి అదృశ్యం


భార్గవ్

పరవాడ: మండలంలోని దీపాంజలీనగర్‌కు చెందిన యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి. ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. దీపాంజలీనగర్‌లోని ఎన్‌టీపీసీ క్వార్టర్స్‌లో నాగులాపల్లి శ్రావణి తన తల్లి లక్ష్మి, తమ్ముడు భార్గవ్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. నాగులాపల్లి లక్ష్మి దీపాంజలీనగర్‌లోని బాల భారతీ స్కూల్‌లో ఆయాగా ఉద్యోగం చేస్తున్నారు. భార్గవ్ డిప్లమో చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు.అప్పుడప్పుడు చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నాడని అయితే తన తల్లి చదువు విషయంలో మందలించడంతో భార్గవ్ ఈ నెల 20వ తేదీన ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో వెళ్లిపోయాడని సోదరి శ్రావణి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. ఏఎస్‌ఐ వర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సాయం


బాధితుడికి నగదు అందిస్తున్న చొక్కాకుల వెంకటరావు తదితరులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో ఇటీవల పిడుగుపాటుతో మేకలు మృతిచెందిన బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. గత సోమవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు గ్రామంలోని సబ్బి రమణకు చెందిన 18 మేకలు మృతి చెందాయి. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, స్పెషల్ పీపీ కరణం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతితో ప్రయాణం


నీటిలో పెరిగే మొక్కలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రకృతి ప్రియులు

- జీవవైవిధ్య ఉద్యానవనంలో విజ్ఞాన యాత్ర
- పెద్ద సంఖ్యలో హాజరైన ప్రకృతి ప్రేమికులు


పార్క్ విశేషాలను వివరిస్తున్న నిర్వాహకుడు రామమూర్తి


సీతాకోక చిలుకగా మారుతున్న గొంగళి పురుగు

ఏయూ క్యాంపస్: ఉషోదయం వేళ ప్రకృతితో మమేకయ్యారు. వేలాది మొక్కల నడుమ నడక సాగించారు. ఈ విజ్ఞాన యాత్రకు వేదికగా నిలిచింది రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనం. ఆదివారం ఉదయం ఏపీ అటవీ శాఖ, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సంయుక్తంగా ఉషోదయపు ప్రకృతి నడక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ యాత్ర సుమారు మూడు గంటల పాటు సాగింది. నగరంలోని విభిన్న రంగాల్లో స్థిరపడిన అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జురాసిక్ కాలం నాటి మొక్కల విశేషాలను పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథ రామమూర్తి, మంగతాయి దంపతులు వివరించారు. అనంతరం ఔషధ వనం, ఎడారి మొక్కలు, నీటిలో జీవించే మొక్కలు, అరుదైన రుద్రాక్ష చెట్టు, కృష్ణుడి వెన్న గిన్నె, సీతమ్మవారి జడ, అశోక వృక్షం వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతీ చెట్టు, మొక్క సమాచారాన్ని తెలియజేస్తూ వాటిలోని ఔషధ విలువలు, వివరాలు వివరించారు. కీటకాలను తినే మొక్కలు, అరుదైన ఆర్కిడ్‌లు, విభిన్న రకాల పామ్ ట్రీలను తిలకించి సంబరపడ్డారు. గొంగళి పురుగు సీతాకోక చిలుకగా మారే ప్రక్రియను ఇక్కడ ప్రత్యక్షంగా చూసిన సందర్శకులు అచ్చెరువొందారు. అరుదైన, అంతరించే ప్రమాదం ఉన్న వేలాది మొక్కలను పార్క్‌లో సంరక్షిస్తూ, విద్యార్థులకు ఒక జ్ఞాన కేంద్రంగా దీనిని నిలుపుతున్నట్లు నిర్వాహకులు రామమూర్తి తెలిపారు. యువత డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీలో సభ్యత్వం తీసుకుని పార్క్ నిర్వహణ, సంరక్షణలో భాగం కావాలని కోరారు.

విస్తృత ప్రచారం అవసరం



మొక్కలంటే నాకు చాలా ఇష్టం. ఈ పార్క్‌ను తరచూ సందర్శిస్తుంటాను. ఇక్కడ ఉన్న వైవిధ్యమైన మొక్కలు మరెక్కడా చూలలేం. దీనికి విస్తృత ప్రచారం అవసరం. కృత్రిమ, అనుకూల పరిస్థితులను కల్పించి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి మొక్కలను పెంచుతున్న నిర్వాహకులకు అభినందనలు.

– ఆర్.నిహారిక, ఉద్యోగి

తెలుసుకుని వచ్చాను



విశాఖపట్నంలో ఇటువంటి పార్క్ ఉందని తెలియడంతో చూడాలని వచ్చాను. నేను ఉంట్లో కూడా అనేక రకాల మొక్కలు పెంచుతుంటాను. మొక్కల పెంపకం, సంరక్షించడం, వాటి ప్రత్యేకతలు ఇక్కడికి వచ్చాక తెలుసుకున్నాను.

– ఎం.సాయి ప్రణతి

దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలకు ఏర్పాట్లు


విద్యుత్ కాంతుల్లో దుర్గాలమ్మ ఆలయం, శ్రీదుర్గాలమ్మ అమ్మవారు(ఇన్ సెట్)

సబ్బవరం: సబ్బవరం ప్రజల ఇలవేల్పు,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వారికోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలను సోమవారం,మంగళవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు.దీనిలో భాగంగా అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సోమవారం విశేష పూజలు నిర్వహిస్తారు. మంగళవారం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు.

2న ట్రాఫిక్ ఆంక్షలు

- గిరి ప్రదక్షిణ సందర్భంగా మళ్లింపు


ట్రాఫిక్ ఆంక్షల గురించి వివరిస్తున్న ఏసీపీ జాన్ మనోహర్

సీతమ్మధార: జూలై 2న సింహాచలం శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు కాలినడకన తరలిరానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలపై ఏసీపీ జాన్ మనోహర్ పలు సూచనలిచ్చారు. ఆదివారం ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సింహాచలం నుంచి బయలుదేరి హనుమంతువాక, వెంకోజీపాలెం, ఎన్ఏడీల వద్ద జాతీయ రహదారిపై కొంత మంది భక్తులు నడిచే అవకాశం ఉన్నందున 2వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు విశాఖ సిటీలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వచ్చే భారీ వాహనాలు, ప్రైవేట్ వాహనాలను లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో ఎక్కాల్సిన ప్రయాణికులు ఆనందపురం, పెందుర్తి, అనకాపల్లి వద్దకు చేరుకునేటట్లు బోర్డింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గిరిప్రదక్షిణ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.వి.ఎస్.ప్రసాద్, ఎస్ఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పరశురామావతారంలో జగన్నాథుడు


పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

అగనంపూడి: జగన్నాథస్వామి రథోత్సవాలు జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలో కనులపండువగా జరుగుతున్నాయి. దశావతారాల్లో భాగంగా 6వ రోజు ఆదివారం జగన్నాథస్వామి పరశురామావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గురు సంతోష్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అగనంపూడి, నిర్వాసిత కాలనీలు, లంకెలపాలెం, దువ్వాడ, ఫార్మాసిటీ కాలనీలు, వడ్లపూడి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక


రాఘవాచార్యులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

- సంస్కృతోన్నత పాఠశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయం
- గురువులకు పూర్వ విద్యార్థుల సత్కారం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల 1983–88 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక అడవివరంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా తమకు విద్య బోధించిన గురువులను ఘనంగా సత్కరించారు. అయితే ఎంతో ఘన కీర్తి ఉన్న దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల ప్రస్తుత స్థితిపై గురువులు కొంత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యాబోధన కమిటీ టీచర్స్‌తోనే నిర్వహిస్తున్నారని చెప్పారు.పూర్వ విద్యార్థులంతా నడుం బిగించి పాఠశాల పూర్వవైభవానికి కృషి చేయాలని కోరారు. పాఠశాల అభివృద్ధి విషయంపై దేవస్థానంతో చర్చించాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఐలూరి రామశాస్త్రి, అధ్యక్షుడు సిడగం రాము, ఉపాధ్యక్షులు పాలూరి నరసింగరావు, నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు సావిత్రి, పి.శేఖర్ పాల్గొన్నారు. అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు టి.పి.రాఘవాచార్యులు, ఎం.లక్ష్మీనరసింహం, రామచంద్రమూర్తితో పాటు విశ్రాంత ఉద్యోగి స్వామి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయిని భానును ఘనంగా సత్కరించారు.

నంగినారపాడు పాల సొసైటీ ఎన్నిక


పాల సొసైటీ కమిటీని ఎన్నుకుంటున్న ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడు (అజనగిరి) పాల సొసైటీ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. గ్రామ మాజీ సర్పంచ్ ఇందల సీతారామయ్య, నాయకులు పి.ఎర్నిబాబు సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షునిగా ఇ.వి.రమణను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నారపిని అప్పలరాజు, బొడ్డపల్లి చిన దాలినాయుడు, నారపిని జోగినాయుడు, బొడ్డపల్లి అప్పలరాజు, లంకె వెంకటరావు, పైడిరాజు, బొడ్డపల్లి గంగరాజు, లంకె అప్పల నర్సమ్మ, చట్టి దేముడు ఎన్నికయ్యారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో బేడా ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి బేడామండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శత నామావళి పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈ భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

కనుల పండువగా సిరిజ్యోతి పూజ


సిరిజ్యోతి పూజలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి ఉత్సవ మూర్తికి మొదటి అంతస్తులో ఆహుతులైన భక్తులందరూ క్షీరాభిషేకాలు నిర్వహించి ముగ్గురమ్మల ప్రాంగణానికి వచ్చి కుంకుమ పూజలు గావించారు. సాయంత్రం 5 గంటల నుంచి వారాహి సిరిజ్యోతి పూజ కనుల పండువగా జరిగింది. రాత్రికి ప్రతి రోజులాగే అత్యంత శక్తివంతమైన వారాహి హోమం నిర్వహించారు. విదేశాల నుంచి వచ్చిన పలువురు భక్తులు వారి స్వహస్తాలతో వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం

- స్పష్టం చేసిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 864వ రోజుకు ఉక్కు రిలే నిరాహార దీక్షలు


దీక్షలో పాల్గొన్న నడుపూరు గ్రామ ప్రజలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 864వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో నడుపూరు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తోందన్నారు. నిర్వాసితులకు ఇప్పటికీ సరైన న్యాయం చేయలేదని, ప్లాంట్‌లో ఉపాధి కోసం సుమారు 15 వేల మంది నేటికీ ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, గంగరావు, గంధం శ్రీనివాస్, ఆదినారాయణ, ఎన్.రామారావు, అయోధ్య రామ్, మంత్రి శంకర్‌నారాయణ, నడుపూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

‘గంగవరం’ కార్మికులకు వేతన ఒప్పందం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: గంగవరం పోర్టు కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన వారికి శాశ్వత ఉద్యోగం, వేతనాలు ఇస్తామని చెప్పారన్నారు. ఏళ్లు గడిచినా వారికి మంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పోర్టులో పోలీసు మాజీ అధికారులను నింపడంతో అక్కడ పోలీసు పెత్తనం, బెదిరింపులు పెరుగుతున్నాయన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్ మాట్లాడుతూ పోర్టులో 14 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు ఇప్పటికీ బేసిక్ 3,700 రూపాయలు కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.ఎం. శ్రీనివాస్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

రౌడీ షీటర్లకు సీఐ ప్రసాద్ కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రసాద్

గోపాలపట్నం: రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఎయిర్‌పోర్టు సీఐ బి.ఎం.డి. ప్రసాద్ సూచించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగరంలో నేరాల నియంత్రణపై పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. పాత నేరస్తులను గుర్తించి వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. వారిలో మంచి మార్పు కోసం ప్రతీ ఆదివారం కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. నేరాలకు పాల్పడినట్లు గుర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

కావ్యజ్ఞుడు ఆచార్య బేతవోలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య దయానంద సిద్ధపటం, ఆచార్య బేతవోలు, అతిథులు

సీతంపేట: ఆచార్య బేతవోలు రామబ్రహ్మం కావ్యజ్ఞుడని, ప్రసిద్ధ విమర్శకుడని వక్తలు కొనియాడారు. రచయిత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన ‘కొత్త గోదావరి’ పద్య కవితా సంపుటి పరిచయ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయిత పేరి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజన సాహిత్యం అంతా ఒకచోట ప్రతిబింబించేలా బేతవోలు రచించిన కొత్త గోదావరి కథా సంపుటి ఉంటుందన్నారు. ఆయన రచనల్లో విశ్వనాథ వారి ప్రచోదీప్తి, శ్రీశ్రీ సామాజిక స్పృహ, కరుణశ్రీ రసస్ఫూర్తి కన్పిస్తుందని పేర్కొన్నారు. కొత్త గోదావరి కవితా సంపుటిలో పది కథలు ఉన్నాయని తెలిపారు. శివపార్వతుల మధ్య సంభాషణ శృంగార శ్రీకంఠంలో అద్భుతంగా రచించారన్నారు. బేతవోలు రచనల్లో గంభీరం ఎలా ఉంటుందో అంతే స్థాయిలో చమత్కారం ఉంటుందన్నారు. ముందుగా గీతం వైస్ చాన్సలర్ ఆచార్య దయానంద సిద్ధపటం ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ ప్రయాగ సుబ్రహ్మణ్యం అతిథులను సభకు పరిచయం చేశారు.